క్లుప్తంగా

2న పాత శివాలయం దుకాణాల లీజుకు వేలం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాత శివాలయం) ఉపాలయమైన శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన ఐదు షాపులను అద్దెకిచ్చేందుకు జనవరి రెండో తేదీన బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి నటరాజ షణ్ముఖం ఒక ప్రకటనలో తెలిపారు. గవర్నర్ పేట పెద్దిభొట్ల వారి వీధిలో ఉన్న దుకాణాల వద్ద ఈ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండో తేదీ ఉదయం పది గంటలకు ఈ బహిరంగ వేలం పాట జరుగుతుందన్నారు. దేవస్థాన కార్యాలయంలో పూర్తి వివరాలు పొంది వేలం పాటలో పాల్గొనవలసిందిగా ఈవో ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

యువకుడిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రేమించాలని వెంటపడి వేధిస్తున్న యువకుడిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీకి చెందిన షేక్ షబీనా(20)కి రెండేళ్ల కిందట కేబీఎన్ కాలేజీలో చదువుతున్న సమయంలో చిట్టినగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ గుణశేఖర్ పరిచయం అయ్యాడు. కొంతకాలంగా ప్రేమిస్తున్నానని ఫోన్ చేసి వేధించసాగాడు. ఈ నెల 23వ తేదీ సాయంత్రం కాలనీకి వచ్చిన గుణశేఖర్ తనను పెళ్లి చేసుకోవాలని, లేని పక్షంలో చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

టీడీఆర్ బాండ్స్ కమిటీ సమీక్ష సమావేశం



పటమట(విజయవాడతూర్పు): టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్) కోసం వచ్చిన దరఖాస్తులను టీడీఆర్ కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే మంజూరు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర చెప్పారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం టీడీఆర్ స్క్రూటినీ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా సర్కిల్ -1 పరిధిలోని భవానీపురం పున్నమి ఘాట్ వద్ద గల ప్రాంతం, ఆంధ్రప్రభ కాలనీ రోడ్డు విస్తరణ, డోర్నకల్ రోడ్డు విస్తరణ, కార్ల్‌మార్క్స్ రోడ్డు విస్తరణ, సర్కిల్-3 పరిధిలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ చెక్‌పోస్టు రోడ్డు విస్తరణ వంటి అంశాలపై చర్చించారు. టీడీఆర్‌ల కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన 14 దరఖాస్తుల డాక్యుమెంట్లు, రికార్డులు, ప్రభుత్వ అనుమతులను పరిశీలించారు. సమావేశంలో నార్త్ తహసీల్దార్ సూర్యారావు, వీఎంసీ డెప్యూటీ కమిషనర్(రెవెన్యూ) జి.సృజన, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గుణదల నందేశ్వరరావు, వీఎంసీ డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పురాణాలు ధర్మానికి నిలయాలు



విజయవాడకల్చరల్: పురాణాలు ధర్మాలకు నిలయాలు అని ఆధ్యాత్మికవేత్త సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. రుషిపీఠం విజయవాడ, భారతీయ సనాతన ధర్మం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో మంగళవారం మన కోసం మన పురాణాలు అన్న అంశంపై ప్రసంగించారు. కోరికలు ధర్మబద్ధంగా ఉండాలని, అటువంటికి మాత్రమే దేవతల అనుగ్రహం ఉంటుందని చెప్పారు. ఉపనిషత్తుల సారాంశమే పురాణాల కథల అంతరార్థమన్నారు. కథల్లో జరిగే ప్రతీ సంఘటన వెనక ధర్మ సూక్ష్మముంటుందన్నారు. హరిశ్చంద్రుని కథ ద్వారా సత్యం విలువ తెలుస్తుందని మాటకు కట్టుబడటం అంటే ఏమిటో తెలుస్తోందని చెప్పారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త డాక్టర్ కప్పగంతు రామకృష్ణ నిర్వహించారు. నగర ప్రముఖులు కృష్ణాజీ, జంధ్యాల శంకర్, అమర్నాథ్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. షణ్ముఖశర్మను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

వన్‌టౌన్‌లో న్యూఇయర్ హంగామా

- కిటకిటలాడుతున్న స్వీట్స్, బేకరీ దుకాణాలు
- వినియోగదారులతో రద్దీగా దర్శనమిస్తున్న గిఫ్ట్, పండ్ల షాప్‌లు
- డైరీలకు గిరాకీ



కొత్తపేటలోని ఓ బేకరీలో రద్దీ



కొత్తపేటలో ఒక మద్యం దుకాణం వద్ద మందుబాబుల సందడి



పాతబస్తీలోని ఓ స్వీట్స్ దుకాణంలో రద్దీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం వన్‌టౌన్ మార్కెట్‌లు కళకళలాడాయి. కొత్త సంవత్సరం తొలి రోజున శుభాకాంక్షలు ఇచ్చి పుచ్చుకోవడం ఆనవాయితీ. ఆ క్రమంలో వన్‌టౌన్‌లోని అన్ని వర్గాల ప్రజానీకం కొత్త సంవత్సర ఆగమనాన్ని ఘనంగా జరుపుకొనేందుకు సమాయత్తమవుతున్నారు. ముఖ్యంగా స్వీట్స్, కేక్‌లు, పండ్లను కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నారు. వన్‌టౌన్‌లో ప్రముఖ మిఠాయి దుకాణాల వద్ద వినియోగదారుల రద్దీ కనిపించింది. ఆయా దుకాణాల వద్ద ప్రత్యేకంగా కేక్‌ల విక్రయాలు ఏర్పాటు చేయడంతో వందల సంఖ్యలో వినియోగదారులు కొనుగోలు చేస్తూ కనిపించారు. కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలిపే క్రమంలో నోటిని తీపి చేయడానికి వన్‌టౌన్ వాసులు కిలోల కొద్దీ స్వీట్స్‌ను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ మెయిన్‌రోడ్డులోని అన్ని ప్రధాన దుకాణాలు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి జోరుగా విక్రయాలు చేశాయి. పంజా సెంటర్‌లోని బేకరీ దుకాణాలు సైతం కళకళలాడుతూ కనిపించాయి.

పండ్ల, గిఫ్ట్ దుకాణాలు కిటకిట

కొత్త సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేయడానికి గ్రీటింగ్స్‌ను, పెద్దలను కలిసి అందజేయడానికి పండ్లను, చిన్నారులకు ఇవ్వడానికి గిఫ్ట్ ఆర్టికల్స్‌ను కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపటంతో ఆయా దుకాణాలన్నీ కిటకిటలాడుతూ కనిపించాయి. గ్రీటింగ్స్‌కు కాలం చెల్లినా అధునాతనంగా వస్తున్న నూతన సంవత్సర శుభాకాంక్షలను ముద్రించి వచ్చిన గిఫ్ట్ ఆర్టికల్స్ అందుబాటులో ఉండటంతో వాటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా వన్‌టౌన్ మెయిన్‌రోడ్డులో ఉన్న ఆయా వస్తువులను విక్రయించే దుకాణాలన్నీ వినియోగదారులతో మంగళవారం సాయంత్రం నుంచి రద్దీగా కనిపించాయి. వినియోగదారుల సంఖ్య పెరగడంతో ఆయా వస్తువుల ధరలు కూడా అమాంతం పెంచేశారని వన్‌టౌన్ వాసులు వాపోతున్నారు.

డైరీలకు గిరాకీ

వన్‌టౌన్‌లో డైరీలు విక్రయించే హోల్‌సేల్ దుకాణాలు కూడా మంగళవారం రద్దీగా కనిపించాయి. కొన్ని సంస్థలు ఆర్డర్లిచ్చి ప్రత్యేకంగా తయారు చేయించగా, మరికొన్ని సంస్థలు మార్కెట్‌లో సిద్ధంగా ఉన్న డైరీలను కొనుగోలు చేసి తీసుకెళ్లడం కనిపించింది. వివిధ వర్గాల వారు వారివారి స్థాయిలో డైరీలను కొనుగోలు చేశారు. ముఖ్యంగా పది రూపాయల విలువ చేసే డైరీల నుంచి నాలుగైదు వందల రూపాయల వరకూ డైరీల ధరలు ఉన్నాయి.







న్యూ ఇయర్ జోష్

నగరంలో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. నగరవాసులు కొత్త సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. యువత బైక్‌లపై తిరుగుతూ, కేరింతలు కొడుతూ సందడి చేశారు. స్వీట్ షాపులు, బొకే దుకాణాల వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. రాత్రి 12 గంటలకు బాణసంచా కాల్చి న్యూ ఇయర్‌కు గ్రాండ్ వెల్‌కమ్ చెప్పారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా అందరూ కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచుతూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ













భాషలు గణితంతో ముడిపడి ఉంటాయి

- కేబీఎన్ కాలేజీ గణిత విభాగాధిపతి కల్మా
- డీఎస్ఎంసీ హైస్కూల్‌లో 'గణితోత్సవం – గణితోత్సాహం'



బహుమతులు అందుకున్న విద్యార్థినులతో కల్మా

భవానీపురం(విజయవాడపశ్చిమ): నిద్ర లేచింది మొదలు తిరిగి నిద్రించే వరకు ప్రతి అంశం గణితంతో ముడిపడి ఉంటుందని, అన్ని శాస్త్రాలు, కళలు, భాషలు కూడా గణితంతో అనుసంధానమై ఉంటాయని కేబీఎన్ కాలేజీ గణిత విభాగాధిపతి కల్మా తెలిపారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (డీఎస్ఎంసీ)లో మంగళవారం 'గణితోత్సవం – గణితోత్సాహం – 2024' నిర్వహించారు. గణితంతో ముగ్గులు, గణితం పాటలు, గణిత ప్రాజెక్టులు, గణిత చార్టులు, గణిత శాస్త్రవేత్తల చిత్రపటాలు తదితర అంశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కల్మా మాట్లాడుతూ శాస్త్రం ముందుకు సాగాలంటే గణితం లేనిదే సాధ్యం కాదని అన్నారు. అందుకే విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకుని గణితంతో ఆడుకునే విధంగా నేర్చుకోవాలని సూచించారు. ఆర్యభట్ట, భాస్కరాచార్య, శ్రీనివాస రామానుజన్, లక్కోజు సంజీవరాయ శర్మ, శకుంతలా దేవి వంటి గణిత శాస్త్రవేత్తలు మనకు అపూర్వ విజ్ఞానాన్ని అందించారని గుర్తు చేశారు. కేబీఎన్ కళాశాల పక్షాన రూ.20 వేలు విలువైన గణిత కిట్‌ను ఆమె విద్యార్థులకు బహూకరించారు. హైస్కూల్ హెచ్ఎం మాతంగి కోటయ్య మాట్లాడుతూ గణితం ఒక సబ్జెక్ట్ కాదని, అది ఒక భాష..ఒక జీవన విధానమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మేథమ్యాటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీ మురళీ ప్రసాద్, జ్యోతిర్మయి, సీహెచ్‌వీఎస్‌వీ ప్రసాద్, విజయలక్ష్మి, శారద, అన్నపూర్ణ, వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణికి అభినందన



విజయవాడస్పోర్ట్స్: ఇటీవల మైలవరంలో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజయవాడకు చెందిన మాగంటి హేమశ్రీ నాలుగు పతకాలను కైవసం చేసుకుంది. సబ్ జూనియర్ విభాగంలో సిల్వర్, జూనియర్ విభాగంలో సిల్వర్, సీనియర్ విభాగంలో గోల్డ్, బెంచ్ ప్రెస విభాగంలో గోల్డ్ మెడల్స్ అందుకుంది. వాంబేకాలనీకి చెందిన హేమశ్రీ గత కొన్నేళ్లుగా రైల్వే ఇనిస్టిట్యూట్‌లోని జిమ్‌లో కోచ్ సందీప్ వద్ద శిక్షణ తీసుకుంటోంది. నాలుగు పతకాలు సాధించిన హేమశ్రీని రైల్వే ఇనిస్టిట్యూట్ అధ్యక్ష కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, ఆకుల రాఘవేంద్రరావు, న్యాయవాది బూసి సతీష్ తదితరులు అభినందించారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రమేష్ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజన్ అయినా వికసిత్ భారత్–2047లో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలని విజ్ఞాన భారతి అధ్యక్షుడు డాక్టర్ రమేష్ చెప్పారు. స్థానిక స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల ఆవరణలో కౌశల్–2024 రాష్ట్ర స్థాయి పోటీలు మంగళవారం జరిగాయి. ఈ పోటీలను రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు భారతీయ విజ్ఞానం పట్ల నిబద్ధతను పెంపొందించేందుకు కౌశల్ ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మన దేశానికి గొప్ప శాస్త్రవేత్తలను అందించే దిశగా కౌశల్ ప్రతిభా పోటీలను 2018వ సంవత్సరం నుంచి విజ్ఞాన భారతి నిర్వహిస్తోందని చెప్పారు. విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి మాట్లాడుతూ వివేకం లేని వ్యక్తి దగ్గర విజ్ఞానం ఉంటే వినాశనానికి దారితీస్తోందన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల డైరెక్టర్ ఎస్.రమేష్, రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, విజ్ఞాన భారతి కార్యదర్శి కె.సుబ్రమణ్యం మాట్లాడుతూ నేటి తరం యువత కొత్త తరహా ఉత్పత్తులను ఆవిష్కరించి దేశాభివృద్ధికి తోడ్పడుతూ మన దేశాన్ని విశ్వగురువుగా మార్చాలన్నారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, రీల్స్, షార్ట్ ఫిల్మ్ పోటీలను నిర్వహించి వాటిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విజయవాడ గొల్లపూడిలోని కామకోటినగర్‌కు చెందిన సంప్రదాయ పాఠశాలకు చెందిన పలువురు చిన్నారులు భక్తి సంగీతాన్ని ఆలపించారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయని వి.పద్మావతి పర్యవేక్షణలో 89 మంది చిన్నారులు అమ్మవారి కీర్తనలను, భక్తి గీతాలను ఆలపించారు. అనంతరం విశాఖపట్నంకు చెందిన ఆర్యన్ నృత్య కళామందిర్‌కు చెందిన సాహితీ రుక్మేందర్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. 10 మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించడంతో పాటు ప్రసాదాలను అందచేశారు.





సీఎస్ విజయానంద్‌కు ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ అభినందన



విజయానంద్‌ను అభినందిస్తున్న బాలాజీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె.విజయానంద్‌కు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ అభినందనలు తెలిపారు. విజయవాడ గుణదలలో గల విద్యుత్ సౌధ కార్యాలయంలో మంగళవారం ఆయన విజయానంద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వెనుకబడిన తరగతికి చెందిన విజయానంద్‌ను బ్యూరోక్రసీలో అత్యున్నత స్థానంలో నియమితులు కావడం హర్షణీయమని అన్నారు.

